

# బంధం లేని అనుబంధం

— లక్ష్మీ యడవల్లి

సంధ్యవేళ : వేణుగోపాలస్వామి ఆలయంలో దీపం వెలిగించి హారతి ఇచ్చాడు పూజారి! గంట గణగణా మోగుతుంటే — అలవాటుగా ఆలయం దగ్గిరకు వచ్చాడు అనంతాచారి. ఉదయం, సాయంత్రం దేవాలయంకి రావడం కొన్ని సంవత్సరాలుగా ఆయన దినచర్యలలో ఒకటైపోయింది.

ఆలయానికి కాస్త దూరంలో ఒక ఏరు ప్రవహిస్తోంది. ఆ ఏటికి, ఆలయానికి మధ్య ఉన్న ప్రదేశం, పిల్లల ఆటస్థలం. సాయంత్రమయ్యేసరికి ఆటల కోసం రావడం, బాగా చీకటిపడే వరకూ ఆడి ఆడి అలసిపోయి ఇంటికెళ్ళడం — రోజూ అనంతాచారి చూసే దృశ్యమే!

ఆయన దృష్టి అలవాటుగా అటు తిరిగింది. పది పన్నెండుమంది పిల్లలు ఆడుతున్నారు. రోజుకో ఆట ఆడతారు. మరి అన్ని ఆటలు వాళ్ళ కెవరు నేర్పిస్తున్నారో లేక వాళ్ళే కొత్త కొత్తవి సృష్టిస్తున్నారా?

అనంతాచారి దృష్టి ఆ పిల్లల్లో ఒక పిల్లాడి మీద నిలిచిపోయింది. ఆ అబ్బాయి వయసు పదేళ్ళుంటుంది. బొద్దుగా, తెల్లగా ఉండి, నీలంరంగు నిక్కరు, తెల్లచొక్కా వేసుకున్నాడు. నల్లగా ఒత్తుగా వంకీలు తిరిగి ఉంది క్రాపు. మిగిలిన పిల్లల మధ్య ఆ అబ్బాయి కొట్టవచ్చినట్టుగా, ప్రత్యేకంగా కనిపించాడు ఆయన కళ్ళకి.

"ఈ ఊరికి కొత్తగా వచ్చి ఉంటాడు." అనుకుని అనంతాచారి ఆలయం లోపలికి వెళ్ళబోతూ, ఎందుకో మరోసారి ఆ అబ్బాయిని చూడాలనిపించి, చూసాడు. నవ్వుతూ ఏదో చెబుతున్నాడు ఆ కుర్రాడు. ఒక్క క్షణం, అనంతాచారి చూపులూ, ఆ కుర్రాడి చూపులూ కలుసుకున్నాయి. అంతలోనే ఆ కుర్రాడు గట్టిగా నవ్వుతూ తల మరోవైపు తిప్పాడు. అనంతాచారి ఆలయం లోపలికి వెళ్ళాడు. పూజారి పలకరింపుగా చిరునవ్వు నవ్వి, తీర్థప్రసాదాలు ఇచ్చాడు. అవి తీసుకుని 'గరుడవాహనం' దగ్గిర కూర్చున్నాడాయన. పరధ్యాన్నంగా ఉంది ఆయన మనస్సంతా! రోజూ వున్న శాంతి లోపించింది మొహంలో! ఇదీ అని వివరంగా చెప్పలేని కారణం కుమ్మరిపురుగులా మెదడును తొలుస్తోంది.

మరి కాసేపయ్యాక, అశాంతిగా లేచాడు అనంతాచారి ఇంటికి వెళ్ళడానికి. ఆలయంలోంచి బయటకు వస్తుంటే మళ్ళీ ఆయన చూపు ఆడుకుంటున్న పిల్లల మీదకు మళ్ళింది.

ఈసారి ఆయన కళ్ళకు 'ఆ కుర్రాడు' కనిపించలేదు. అందరూ ఉన్నారేగాని ఆ ఒక్క కుర్రాడే లేడు. ఆ కుర్రాడు లేకపోవడం ఏదో వెలితిగా అనిపించింది ఆయనకి.

"ఏమిటిది ఇవాళ? ఆ కుర్రాడికీ తనకీ ఏమిటి సంబంధం! అక్కడున్న అనేకమంది పిల్లల్లో ఆ అబ్బాయీ ఒకడు. ఆ పిల్లలందరూ మాత్రం తనకి తెలుసునా? కాని ఈ అబ్బాయి...."

అలల్లా వస్తున్న ఆలోచనలని అదిమిపెడుతూ, మెల్లిగా కదిలాడు అనంతాచారి. కాళ్ళు యాంత్రికంగా ఇంటివేపే దారి తీస్తున్నా, ఆయన మనసంతా ఆ అబ్బాయి రూపమే నిండిపోయింది. దారిలో, తెలుగు టీచర్ రంగనాథంగారు రెండు మూడుసార్లు పిలిస్తేగానీ అనంతాచారికి వినిపించలేదు.

"ఇచ్చిన మందు అయిపోయింది. పొద్దున్న మా అబ్బాయిని పంపించమంటారా?" అన్నాడు రంగనాధంగారు.

అలాగే అన్నట్టు తలూపి ముందుకు కదిలాడు అనంతాచారి.

"ఏమిటి చెప్మా ఈయన ఇవేళ యిలా ఉన్నాడు?" అనుకొంటూ పక్క సందులోకి తిరిగాడు రంగనాధంగారు!

అనంతాచారి ఇంటికి వచ్చేసరికి, ఆ వీధిలోని నలుగురైదుగురు మందుల కోసం వచ్చి, ఆయన రాక కోసం ఎదురుచూస్తున్నారు. ఆయన రావడం చూసిన జానకి, మందులపెట్టె తీసుకువచ్చి ఆయన కిచ్చింది. పడక కుర్చీలో కూర్చుని, మందులపెట్టె వళ్ళో పెట్టుకున్నాడు అనంతాచారి. మరో అరగంట కల్లా వచ్చిన వాళ్ళకి మందులిచ్చి పంపేశాడు. ఈలోగా జానకి కూడా వంటపని ముగించి, వచ్చి, తీరుబడిగా కూర్చుంది. ఆయన కుర్చీకి కాస్త దూరంలో పక్కనే ఇన్ని గోరుచిక్కుడుకాయలు ఒక్కొక్కటే గిల్లుతోంది.

రోజూ అయితే అనంతాచారి, ఆ సమయంలో ఊళ్లో జరిగిన విశేషం గురించో, లేదా తను 'దొరల' దగ్గిర పనిచేసినప్పటి అనుభవాలో, అదీ గాకపోతే—పేపర్లో పడిన వింత విషయాల గురించో చెబుతూ ఉంటే, వినడం జానక్కి అలవాటు. ఆ పని అయిన తరువాత భోజనానికి లేవడం, ఆ తరువాత ఆయన ఏ భాగవత, రామాయణమో తీసుకుని చదువుతూ ఉంటే, నిద్ర వచ్చే వరకు వింటుంది జానకి. ఆవిడకు ఆవలింతలు రాగానే ఆయన పుస్తకం మూస్తాడు. ఆవిడ పెద్ద దీపం ఆర్పి, కోడిగుడ్డు దీపం వెలిగించి పడుకుంటుంది.

అలాటిది ఈరోజు, ఆయన మాటా పలుకూ మర్చిపోయినవాడిలా మవునంగా ఉండటం, రవ్వంత ఆశ్చర్యం కలిగించింది జానక్కి.

"ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అంది కాసేపయాక జానకి, యథాలాపంగా అన్నట్టు.

ఆ మాటతో ఆయన మెల్లిగా తల తిప్పి ఆవిడ వంక చూసారు. ప్రసన్నంగా, ప్రశాంతంగా ఉంది జానకి మొహం! అనుభవాల సారంతోపాటు, కొత్తగా వచ్చిన వృద్ధాప్యపు ఛాయలు కూడా కనిపిస్తున్నా, కళ తగ్గని ఆవిడ వదనం, ఆయనకు అవ్యక్తమైన హాయిని కలిగించింది ఆ క్షణంలో! ఆయన మరోక్షణం తర్వాత చిన్నగా నిట్టూర్చి, కుర్చీలోంచి లేచి, మందులపెట్టె, పక్కనున్న బల్ల మీద పెట్టాడు.

"స్నానం చేసి వస్తాను. కొంచెం చికాగ్గా ఉంది" అనేసి వెళ్ళిపోయాడు ఆయన అక్కడ్నించి.

మనసు బాగా లేనప్పుడు, అలా వేళగాని వేళ స్నానం చేయడం ఆయనకి అలవాటే!

'ఇప్పుడు కారణం ఏమిటో చెప్పకపోయినా రాత్రి పడుకునేలోగా చెబుతారులే' అనుకుంటూ జానకి కూడా లేచింది, మిగిలిన గోరుచిక్కుడు కాయలను గోడపక్కగా నెట్టి, వంటింట్లోకి వెళ్ళింది. బావి దగ్గర చేదతో ఆయన నీళ్ళు తోడి పోసుకోవడం, జానక్కి వంటింటి కిటికీలోంచి కనిపించింది. ఒక్కక్షణం ఆయన్నే చూస్తూ ఉండిపోయింది. అరవై ఏళ్ళు వస్తున్నా వృద్ధాప్యపు ఛాయలు కనిపించని బలమైన వళ్ళు అనంతాచారిది. చిన్నప్పటినుంచీ తిని తిరగడాల్లో క్రమశిక్షణగా ఉండటంవల్ల, జబ్బు ఎరుగని శరీరం. ఆయనకి కోపం అంటే తెలియదు. ఎప్పుడూ చిరునవ్వుతో ప్రశాంతంగా మాట్లాడే మనిషి! హోమియోపతి వైద్యంలో ఆ చుట్టుపక్కల ఉన్న ఊళ్ళలో ఆయన్ని మించినవారు లేరు. జబ్బు తగ్గించడంలో ఉన్న శ్రద్ధ, డబ్బు అడిగి తీసుకోవడంలో లేదు ఆయనకు.

"ఇలా అయితే ఎలాగండీ? సంసారం గడిచేదెట్లా? మనకేమైనా పిత్రార్జితాలున్నాయా? ఈ పాత కొంప తప్ప?" అన్న జానకి మాటలకు—

"ఇంత ఇవ్వు అని అడగటం కంటే, మీకు తోచింది ఇవ్వండి అన్నప్పుడే వాళ్ళు ధారాళంగా ఇస్తారు జానకీ. అయినా మనకిప్పుడు సరిపోయినంత సంపాదన వస్తూనే ఉందిగా!" అన్నాడాయన.

"ఇప్పుడు సరేనండీ! రేపు పిల్లా పాపా పుడితే వాళ్ళ కోసమైనా ఇప్పటినుంచీ జాగ్రత్త పడద్దూ?"

"మన పిల్లల అదృష్టం బాగుంటే డబ్బు కూడా దానంతటదే వస్తుందిలే!"

అది వేదాంతమనుకోవాలో, మొండి వాదన అనుకోవాలో జానక్కి అర్థం కాలేదు మొదట్లో. కాని ఆ ప్రస్తావన మళ్ళీ ఎప్పుడూ తీసుకురాలేదు.

మరో నాలుగేళ్ళకి 'తులసి' పుట్టింది.

'తులసి'—గుర్తుకు వచ్చేసరికి జానకి వాస్తవంలోకి రావడమూ; సరిగ్గా అప్పుడే అనంతాచారి వంటింట్లోకి రావడం ఒక్కసారే జరిగాయి.

యాంత్రికంగా జానకి వంటింట్లో దండెం మీద ఆరేసిన మడిబట్ట ఇచ్చింది. అది కట్టుకుని ఆయన తడి తువ్వాలు పెరట్లో ఆరవేసి వచ్చేసరికి, పీట, కంచంపెట్టి భోజనం వడ్డించే ఏర్పాట్లు చేసింది.

ఆరోజు భోజనం దగ్గిర కూడా మవునంగానే ఉండిపోయాడు అనంతాచారి. మామూలుగా అయితే, ఆ సమయంలో జానకి ఇరుగింటి పొరుగింటి విషయాలు చెబుతుంటే, ఊ కొడుతూ, మధ్య మధ్యలో ప్రశ్నలడుగుతూ ఆవిడ్ని వేళాకోళం చేస్తూ భోజనం ముగించేవాడు.

మరో పది నిముషాల తరువాత ఆయన, ముందు హాల్లో హోమియోపతి పుస్తకం తీసి చదువుకొంటున్నాడు. జానకి తను భోంచేసి వంటిల్లు మూసి వచ్చేసరికి ఇంకో గంట గడిచింది. అప్పటికీ ఆయన చేతులో పుస్తకం ఉంది. దీక్షగా పరీక్షలకు చదివేవాడిలా చదువుతూన్నాడు.

'ఏమిటివాళ ఇలా మూగనోము పట్టారీయన? పడుకునే వేళవుతున్నా మాటా పలుకూ లేదు?' అనుకుంటూనే జానకి పక్కలు సిద్ధంచేసింది.

అంతలో ఆయన ఆ పుస్తకం పక్కన పెట్టి మరో పుస్తకం అందుకున్నాడు. జానకి అది గమనించి వస్తున్న నిట్టూర్పుని లోలోపలే అణచుకుని మంచం పక్కనే కొంగు పరచుకుని పడుకుంది అలసటగా!

కలత నిద్రతో అవస్థపడుతున్నాడు అనంతాచారి. ఏనాడో జరిగిన సంఘటనలు, కలగాపులగంగా గుర్తుకు వస్తున్నాయి. సంతోషం, విచారం, దుఃఖం మిళితాలయిన ఆ జ్ఞాపకాలు ఆయన్ని సుఖ నిద్ర నుంచి దూరం చేస్తున్నాయి ఆ రాత్రి! అటు పక్కనే పడుకున్న జానకి మాత్రం హాయిగా నిద్రపోతోంది.

మరోవైపు ఒత్తిగిల్లి పడుకున్నాడాయన అంతలో ఎవరో వీధి తలుపు తట్టిన శబ్దం వినిపించింది. చటుక్కున మంచం దిగి వెళుతుండగానే మరోసారి దబాదబా తట్టారు. అప్పుడే గోడ గడియారం పదకొండు గంటలు కొట్టడం ప్రారంభించింది. అనంతాచారి వీధి తలుపు తెరిచాడు.

"ఆచారిగారూ! త్వరగా రావాలి మీరు. మా పక్కింట్లో అబ్బాయి పరిస్థితి ప్రమాదంగా ఉంది"

అన్నాడు ఆత్రుతగా, తలుపుకవతల నిలబడిన కుర్రాడు. అతనికి పదహారు పదిహేడు సంవత్సరా లుంటాయి.

ఇలాటి అర్ధరాత్రి పిలుపులు అనంతాచారికి కొ_త్తగావు. అది అర్ధరాత్రయినా, అవతల హోరున వర్షం కురుస్తున్నా ఆయన తన మందులపెట్టె తీసుకుని వెళ్ళడం, ఆయన తిరిగి వచ్చేవరకూ జానకి ఆదుర్దాగా ఎదురు చూస్తూ ఉండటం ఆ ఇద్దరికీ అలవాటయిన విషయమే!

జానకిని లేపి తలుపు వేసుకోమని చెప్పి, వచ్చిన కుర్రాడితో బయలుదేరాడు అనంతాచారి.

"సాయంత్రం కూడా బాగానే ఆడాడు మా అందరితో. ఇంటికొచ్చి భోజనం చేసాక వాంతులవడం ప్రారంభించాయి. మంచినీళ్ళు కూడా తాగటంలేదు" అంటూ ఆ కుర్రాడు చెప్పుకొస్తుంటే మవునంగా వింటున్నాడు అనంతాచారి.

నాలుగయిదు బజార్ల అవతల ఒక చిన్న సందులోకి దారి తీసాడు ఆ కుర్రాడు. చిరు చీకటిగా ఉంది. ఆ సందులో మరో పది గజాలు వెళ్ళాక ఒక చిన్న మిద్దె ఇంటిముందు ఆగి, వీధి తలుపు తీసాడు. ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి. అస్పష్టంగా మాటలు వినిపిస్తున్నాయి బయటకి!

"రండి! ఈ వాటానే" అని ఆ కుర్రాడు దారి చూపిస్తుంటే అతని వెనకాలే ఆ ఇంట్లోకి అడుగు పెట్టాడు అనంతాచారి. అది రెండు గదుల పోర్షను. ముందు గదిలో మంచంమీద పదేళ్ళ కుర్రాడు పడుకుని ఉన్నాడు. అ కుర్రాడ్ని చూసి క్షణకాలం నిశ్చేష్టుడయ్యాడు అనంతాచారి.

ఆ సాయంత్రం గుడి దగ్గిర తను చూసిన క్రొ_త్త కుర్రాడే మంచంలో పడుకుని మూలుగుతున్నాడు నీరసంతో.

అంతలోనే తేరుకుని ఆయన మంచంపక్కనున్న కుర్చీలో కూర్చుని కుర్రాడ్ని పరీక్ష చేయడం ప్రారంభించాడు. రెండు మూడు నిముషాలయిన తరువాత _ "ఒక గ్లాసు వేడినీళ్ళు పట్టుకురా" అని చెప్పాడాయన పక్కన నిలబడిన కుర్రాడితో! ఆ కుర్రాడు బయటికి వెళ్ళిపోయాడు.

అనంతాచారి మందులపెట్టె తెరిచి _ కుర్రాడికి ఇవ్వవలసి మందుసీసాలు బయటికి తీ స్తున్నాడు.

అప్పుడు తట్టింది ఆయనకి _ తను వచ్చాక ఇంత సేపయినా పెద్దవాళ్ళు ఎవరూ కనిపించ లేదని. ఒక పక్క కుర్రాడు ఇలా వుంటే, ఈ పిల్లాడి తల్లీ తండ్రీ ఏమయ్యారు? ఏం చేస్తున్నారు?


"ఇవుగోండి నీళ్ళు" అన్న మాటతో ఆయన ఆలోచనలు చెదిరిపోయాయి.

చేతిలో తయారుగా వుంచుకున్న మాత్రలు సీసాలోంచి మూడురకాల మాత్రలని_అతి కష్టం మీద మింగించాడు వేడినీళ్ళతో. ఇంకా నీరసంతో మూలుగుతున్నాడు ఆ అబ్బాయి.

"ఈ కుర్రాడి అమ్మా, నాన్నా..." అని ఆయన ఏదో అడగబోతుంటే - మధ్యలోనే అందుకున్న ఆ కుర్రాడు_"కుమార్ కి-వీడిపేరు కుమార్ అమ్మ లేదండీ! నాన్నగారొక్కరే వున్నారు. వాంతులవడం మొదలు పెట్టగానే ఆయన నన్ను పిలిచి, వీడ్ని చూస్తుండమని చెప్పి - మందులు తీసుకు రావడానికి వెళ్ళారు." అని చెప్పాడు,

"హూ" అన్నాడు అనంతాచారి.

"ఆయన వెళ్ళి చాలా సేపయిందండీ. మళ్ళీ



టొమాటోలను పళ్ళెంలో విడివిడిగా బోర్లించి పెట్టాలి. కాయలుగా వున్నవి గబుక్కున పండాలంటే బియ్యం డబ్బాలోగాని, గిన్నెలో గాని మూతపెడితే చక్కగా పండుతాయి.

వాడికి రెండుసార్లు వాంతులయ్యే సరికి కంగారు పడి మిమ్మల్ని తీసుకొచ్చాను" అన్నారు మళ్ళీ ఆ కుర్రాడు.

"ఇంకేమీ భయం లేదులే! హాయిగా నిద్ర పోతాడు. ఇదుగో ఈ మందు రేపు ఉదయం ఇవ్వమని చెప్పు." అని ఓ పొట్లం ఆ కుర్రాడి చేతికిచ్చి బయలుదేరడానికి అన్నట్టు లేచాడు అనంతాచారి.

అయన వరండాలోకి వచ్చేసరికి, అప్పుడే ఒక వ్య_క్తి - వీధి చెక్కగేటు తెరిచి సైకిలు లోపలకి తీసుకువస్తున్నాడు.

"కుమార్ వాళ్ళ నాన్నగారండీ" అన్నాడు అనంతాచారి పక్కన నిలబడిన కుర్రాడు.

వరండాలోని దీపం వెలుగులోకి ఆ వ్య_క్తి రాగానే-అతన్ని చూసి అనంతాచారి విద్యుత్ఘాతం తగిలిన వాడిలా బిర్రబిగుసుకు పోయాడు. అవతలి వ్య_క్తి పరిస్థితీ అలానే అయింది!

"ఆచారిగారు ఈ మందు ఇచ్చారండి" అంటూ పక్కనున్న కుర్రాడు ఆ వ్య_క్తి చేతిలో మందు పొట్లం పెట్టి వాళ్ళ వాటాలోకి వెళ్ళిపోయాడు. వా_స్తవంలోకి వచ్చిన ఆ వ్య_క్తి అప్రయత్నంగా "నమస్కారం" అన్నాడు అనంతాచారిని చూసి.

అ మాటతో అనంతాచారిలో కదలిక వచ్చింది. ఎదురుగా వున్న అ వ్య_క్తిని ఓసారి, లోపల మంచం మీద పడుకున్న కుర్రాడి నోసారి మార్చి మార్చి చూసి_పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయారక్కడ్నించి.

ఆ వ్య_క్తి చిన్నగా నిట్టూర్చి వీధి తలుపులు గడియ వేసి ఇంట్లోకి వచ్చాడు. ప్రశాంతంగా నిద్రపోతున్న కుమార్ని చూసి, వాడికి దుప్పటి కప్పి, పక్కనే వున్న కుర్చీలో కూర్చున్నాడు. అలసట, ఆందోళనా, అంతకు మించిన ఆలోచనా భారం అతని కళ్ళల్లో కనిపిస్తున్నాయి.

*

"ఏమండీ! తులసి మనల్ని విడిచి వెళ్ళిపోయిందండీ" అంది జానకి బాధ ఏడుపు కలగలసిన స్వరంతో.

అప్పుడే ఇంటికి వచ్చిన అనంతాచారి అది విని-ఓ క్షణం అప్రతిభుడయ్యాడు.

"అది అన్నంత పనీ చేసిందండీ!" ఈసారి దుఃఖం ఆగలేదు జానక్కి. కళ్ళ వెంట ధారా పాతంగా నీళ్ళుకారుతున్నాయి.

అనంతాచారి తేరుకున్నాడు. ఆయన కళ్ళ ముందు నాలుగు రోజుల క్రితం జరిగిన సంఘటన మెదిలింది.

ఆ ఊళ్ళోని, మిషన్‌స్కూలు టీచరు 'జాన్' ని ప్రేమించానని తులసి చెప్పగా విని అనంతాచారి, జానకి తమ చెవులను తామే నమ్మలేక పోయారు. ఆకుల చాటున పిందెలా, తల్లి చాటు పిల్ల తులసి, అనుకున్న వాళ్ళకి ఆమాట శరాఘాతంలా తగిలింది; అనంతాచారి కయితే - తన తరతరాల శ్రోత్రీయం అంతా బూడిదై పోయిందనిపించింది. జానకి కళ్ళకి తులసి-తన గుండెల్లో చిచ్చు పెట్టిన మహమ్మారిలా కనిపించింది. ఆ తరువాత జానకి ఏడ్చింది.__ తిట్టింది_కొట్టింది. అనంతాచారి మాత్రం తులసిని ఒక్కమాట అనలేదు. తన గదిలోకి జీవచ్ఛవంలా వెళుతూ ఒక్కసారి-అదే చివరిసారి అన్నట్టు__ తులసివంక చూసాడు. ఆ చూపులో విర_క్తి,

అసహ్యం, కొట్టవచ్చినట్టు కనిపించాయి తులసికి. తట్టుకోలేక తల దించుకుంది.

ఆ రోజు ఆ ఇంట్లో-స్మశాన ప్రశాంతత రాజ్యమేలింది. ముగ్గురు ఆగర్భ శత్రువులు ఒకే చోట చేరితే ఆ పరిస్థితి ఎలా వుంటుందో ఆనాడలా వుంది ఆ ఇల్లు:

ఆ రాత్రి జానకి ఎన్నో చెప్పి చూసింది తులసికి. బతిమాలింది. బామాలింది. ప్రేమ మనోబలాన్నిస్తుంది అన్నది తులసి విషయంలో అక్షరాలా నిజమయింది.

నాలుగోరోజున తులసి – జాన్‌తో కలిసి వెళ్ళిపోయింది. ఆ రోజే ఆ ఇద్దరూ ఆ వూరు కూడా విడిచి వెళ్ళిపోయారు.

ఆ తరువాత తెలిసిన విషయాలు చాలా వున్నాయి. జాన్ ఆ వూరు నుంచి బదిలీ చేయించుకున్నాడని, మరో రెండేళ్ళకు తులసి - ప్రసవం సమయంలో చనిపోయిందని అలా ఒకోటి ఆరాగా అనంతాచారికి, జానక్కి అడపాదడపా తెలిసేవి. ఎవరి సంగతో విన్నట్టుగా, వినేవాళ్ళు: అంతరంగంలోని దుఃఖం అవతలవాళ్ళకి కనిపించనిచ్చే వాళ్ళు కాదు. క్రమంగా తులసి గురించి పూర్తిగా మర్చిపోయే స్థితికి వచ్చామనే దశకు వచ్చేసారిద్దరూ. అయితే అది నిజమో కాదో వాళ్ళ మనస్సులకు తెలియాలే, తప్ప మరో మనిషికి తెలియదు.

మళ్ళీ ఆ ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం, ఎన్నో సంవత్సరాలకి గాని ఏర్పడలేదన్నది మాత్రం నిజం. కాలాన్ని మించిన వైద్యుడుగాని, మందుగాని, వేరొకటి లేదు. అనుభూతులు, ఆనందం లేని యాంత్రిక జీవితానికి అలవాటు పడిపోయారు అనంతాచారి, జానకి. ఎప్పుడో తప్ప, నవ్వులు, కేరింతలు, వేళాకోళాలు ధ్వనించని యిల్లు అయిపోయింది వాళ్ళది.


*

తెల్లగా తెల్లవారింది. బద్ధకంగా నిద్రలేచాడు అనంతాచారి. అప్పటికే జానకి లేచి ఇంటి పనులలో నిమగ్నమయింది. మరో అరగంటలో అవశిష్టాలు ముగించుకుని యథాప్రకారంగా గుడికి బయలుదేరాడు అనంతాచారి. ఆయన కళ్ళముందు క్రితం రోజు రాత్రి చూసిన "జాన్' రూపమే మెదులుతోంది. తను అతన్ని చూసిన విషయం జానక్కి తెలియదు. తెలియకుండా ఉండటమే మంచిదిలా అనిపించింది ఆయనకి. 'మానిన గాయాన్ని రేపే వైద్యుడుండడు' అని తనకు తానే సమాధానం చెప్పుకున్నాడు.

ఆలయంలో తీర్థప్రసాదాలు తీసుకుని బయటకి వస్తుంటే ఒక్కసారి ఆ ఇంటికి వెళ్ళి కుమార్‌ని చూసి వస్తే అనిపించింది ఆయనకి. ఎటూ తేలని ఆలోచనతో కాసేపు అలానే నిలబడిపోయాడు.

అనుబంధంతో అంతర్లీనంగా ముడిపడిన మమకారం – కుమార్‌ని చూడమనే మనసుని ఆదేశిస్తుంటే, ఆయన కాళ్ళు ఆ ఇంటి వైపే దారి తీసాయి: ఎక్కడో మనసు మారుమూలల్లో తులసి చిన్నప్పటి రూపం, చిట్టి చిట్టి మాటలు మాట్లాడే తులసి, తప్పటడుగులు వేసే తులసి– "నాన్నా పుస్తకం'' అని బడికి వెళ్ళడానికి తయారయ్యే తులసి అలవోకగా కదిలి మాయమయింది.

ఆయన కంటిపొరల్లో కన్నీటితెరలు నిలిచాయి. నడుస్తున్న దారి మసగ్గా కనిపించింది. ఉత్తరీయంతో కళ్ళు తుడుచుకున్నాడు. నడక వేగం పెంచాడు. క్రమంగా ఆ ఇల్లు దగ్గరవుతుంటే ఆయనలో ఉద్వేగం హెచ్చింది. అంతకుక్రితం కొన్ని గంటలవరకూ కుమార్ ఎవరో తనకి తెలియదు. కాని ఇప్పుడు తామిద్దరి మధ్యా ఒక బంధం - రక్తబంధం కాదనడానికి వీల్లేని అనుబంధం ఉందని తెలిసి వచ్చాక, తను చూడటానికి వెళ్తున్నది వైద్యుడిగా కాదు - తాతయ్యగా! ఆ భావన రాగానే ఒక్కసారిగా వంట్లోని రక్తం పైకి ఎగజిమ్మినట్లయింది. ఆయనకి శరీరం గగుర్పొడిచినట్లయింది. సన్నని వణుకు మొదలయింది వంట్లో. నడుస్తున్నవాడు ఒక్కసారి ఆగిపోయాడు. మనస్సుని మనిషిని నిలవరించుకోవటానికి రెండు మూడు నిముషాలు పట్టింది.



బెండకాయలను బుట్టలో వేసి తడిబట్ట కప్పి వుంచితే ఎండిపోకుండా వుంటాయి.

జీవన సంధ్యవేళ ఎదురైన ఆ చిత్రమైన సంఘటనకి ఆయన చిత్తం వివశమైపోయింది. ఆ క్షణంలో ఒక్కసారి మరో పదేళ్ళ వయసు మీద బడినట్టయింది.

ఉద్వేగం తగ్గించుకుని మళ్ళీ ఆ ఇంటివైపు నడవడం ప్రారంభించాడు అనంతాచారి. ఇప్పుడు ఆయన మనస్సు నిరామయంగా ఉంది. నిశ్చలంగా నిర్మలమైన సరస్సులా ఉంది. శరీరం తేలిక పడింది. అడుగుల్లో వేగం పెరిగింది.

ఆయన ఆ ఇంటికి వచ్చేసరికి ఆయనకు కనబడిన దృశ్యం ఆయన్ని మరో అడుగు ముందుకు వెయ్యనివ్వలేదు.

కుమార్‌ని వరండాలో పడుకోబెట్టారు. వాడి ముక్కుల్లో దూది ఉండలు ఉన్నాయి. వాడి పక్కనే జాన్ నిశ్శబ్దంగా ఏడుస్తున్నాడు. ఆ పక్కనే పక్కవాటా వాళ్ళ అబ్బాయి ఆ కుర్రాడి తల్లితండ్రులు విచారంగా నిలబడి ఉన్నారు.

"ఆచారిగారొచ్చారు'' అన్న పక్కింటి కుర్రాడి మాటకి, జాన్ తలెత్తి, ఆయన్ని చూసాడు కన్నీళ్ళతో.

ఎక్కడో గుండె లోపలనుంచి సన్నని నొప్పి ప్రారంభమైంది అనంతాచారికి. అది క్షణక్షణానికి ఎక్కువవుతున్నట్టుగా అనిపిస్తోంది. గొంతుడిక్కపట్టినట్టుగా ఒకరకమైన బాధ కలిగింది ఆయనకు.

ఒక్కసారి ఒకే ఒక్కసారి – నిద్రపోతున్నట్టుగా వున్న కుమార్‌ని చూసి - గిరుక్కున వెనక్కి తిరిగాడాయన: ఎవరూ ఆయన్ని వెనక్కి పిలవలేదు.

కూరలు తీసుకుని ఇంట్లోకి వెళ్ళబోతున్న జానక్కి, అనంతాచారి గబగబా రావడం కనిపించి, అలాగే నిలబడి పోయింది. ఆయన ఇంట్లోకి వచ్చాడు. మొహం కందగడ్డలా ఎర్రగా వుంది. కళ్ళు మందార పువ్వుల్లా వున్నాయి. లోపలికి వస్తూనే బల్ల మీద వున్న మందుల పెట్టె తీసుకున్నాడు దాన్ని హాల్లో ఒక మూలగా వున్న అటక మీదకి విసిరేసాడు. అది చూసిన జానక్కి నోటమాట రాలేదు. ఆ తర్వాత గబగబా పెరట్లో బావి దగ్గర కెళ్ళి తలస్నానం చేయడం ప్రారంభించాడు. జానక్కి అంతా అయోమయంగా వున్నది జరుగుతున్నది చూస్తుంటే.

ఆ రోజు అనంతాచారి నిరాహారంగా వుండి పోయాడు. ఒక్కమాట రాలేదు ఆయననోట్లోంచి. జానక్కి అడుగుదామని వున్నా ఆయన మవునం ఆవిడ్ని నోరు తెరవనివ్వలేదు. కారణం కోసం ఆలోచిస్తోంది ఆవిడ.

ఆ మర్నాటి నుంచీ అనంతాచారి గుడికి వెళ్ళడం కూడా మానేసాడు ! □